క్లుప్తంగా

ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఎన్నో ఏళ్ళ తర్వాత పూర్వ విద్యార్థులు గచ్చిబౌలిలోని 'ఎస్కీ'కి రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సంతోషంతో ఒకరినొకరు పలకరించుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు. తమకు చదువుచెప్పిన అధ్యాపకులు, ఎస్కీ అధికారులు, డైరెక్టర్ రామేశ్వర రావును ప్రిన్సిపల్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పలకరించారు. సమావేశాన్ని జ్యోతి వెలిగించి డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'ఎస్కీ'లోని ప్రస్తుత విద్యార్థుల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా సహకరించాలన్నారు. పూర్వ విద్యార్థులు అందరి హృదయాలకు దగ్గరగా ఉంటారన్నారు. వారి అభివృద్ధి మన అభివృద్ధి తప్ప మరొకటి కాదన్నారు. ఎస్‌పీజీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కెరీర్ వృద్ధికి నెట్‌వర్కింగ్ చాలా ముఖ్యమన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు, ఖైరతాబాద్ అశ్విన్ ఆస్పత్రుల డైరెక్టర్ జి సీతాదేవి మాట్లాడుతూ భవిష్యత్తు కార్యకలాపాలకు పూర్తి సహకారం అందిస్తామని, ప్రస్తుత విద్యార్థులకు అన్ని రకాలుగా సహకారం అందించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. పూర్వవిద్యార్థులుప్రియతం, ఎం శ్రావణి తమ పాతజ్ఞాపకాలను, పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు, పనితీరుపై ప్రసంగించారు.

కృష్ణానగర్‌లో బీజేపీ నాయకుల పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ కృష్ణానగర్‌లో నెలకొన్న రోడ్లు తదితర సమస్యలపై ఆదివారం స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలన్నారు. కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. కాలనీ అధ్యక్షుడు సంపత్, మూర్తి, సుధాకర్, వీరంశెట్టి, హనుమంతు, నందు గౌడ్, శివ, ప్రభాకర్, మహేష్, మాధురి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తొలగిస్తారు.. తరలించరు

కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు వాటిని తరలించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో 5రోజుల క్రితం విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలను తొలగించారు. అయితే వాటిని రోడ్లపైనే పడేశారు. ఈ విషయమై కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, అది తమ పని కాదని, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తారని చెప్పడం గమనార్హం. దీంతో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోందని, కాలనీ ప్రధాన కార్యదర్శి మహేశ్ 'సాక్షి'దృష్టికి తీసుకువచ్చారు.


వెంకటేశ్వరకాలనీలో తొలగించిన చెట్ల కొమ్మలను రోడ్డుపైనే వదిలేసిన దృశ్యం

సమావేశంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయరాణే. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, హాజరైన బీజేపీ ముఖ్య నాయకులు





తెలంగాణలో బీజేపీ విజయానికి
ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయ రాణే

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ విజయం సాధించడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయరాణే అన్నారు. ఆదివారం విధానసభ ప్రవాస్ యోజనలో భాగంగా అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు.

- ఈ సందర్భంగా దత్తాత్రేయరాణే మాట్లాడుతూ.. బీజేపీకి కుత్బుల్లాపూర్ విధాన సభ సీటు ఎంతో కీలకమన్నారు. కుత్బుల్లాపూర్‌లో బీజేపీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ప్రతి అవకాశాన్ని అనుకూలంగా మలచుకుని బీజేపీ జెండా ఎగువేయాలన్నారు.
- అనంతరం సోషల్ మీడియాలో చురుగ్గా వ్యవహరిస్తున్న నాయకులు, కార్యకర్తలతో సునీల్ రాణే, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌లు సమావేశమై పలు సూచనలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి చేరువయ్యేలా చేయడం, సమస్యలపై పోరాడాలని దిశా నిర్దేశం చేశారు.
- ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కూన శ్రీనివాస్‌గౌడ్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సులోచన, విధాన సభ ప్రవాస్ యోజన ఇన్‌చార్జ్ ఎంఎస్ వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, విగ్నేశ్వర్, సెన్సార్ బోర్డు సభ్యులు నటరాజ్‌గౌడ్, కౌన్సిలర్ రాజిరెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్లు జీకే శేఖర్‌యాదవ్, గడ్డం రాజేందర్ రెడ్డి, రాజా సదానందం, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు బీఆర్ఎస్‌కేవీ కృషి

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల సాధనకు బీఆర్ఎస్‌కేవీ పని చేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వీబీపీ బ్రెడ్ కంపెనీలో 20 సంవత్సరాలుగా పని చేస్తున్న రజియా సుల్తానా ఇటీవల పదవీ విరమణ చేయగా పరిశ్రమకు ఆమెకు రావాల్సిన బెనిఫిట్ల ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ వస్తోంది. దీనిపై బాధితురాలు బీఆర్ఎస్‌కేవీ నేత మదన్‌గౌడ్‌ను ఆశ్రయించగా ఆయన పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్ల కింద మొత్తం రూ.1.50 లక్షలు ఇచ్చేలా ఒప్పించారు. సదరు మొత్తాన్ని చెక్కు రూపంలో ఆదివారం షాపూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో కార్మికురాలు రజియా సుల్తానాకు అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాష్, రాంబాబు, కిరణ్ కుమార్, లక్ష్మణ్, ముత్యపాక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు రుణాల అందజేత

కుత్బుల్లాపూర్: మైనార్టీల జీవన స్థితిగతులను మెరుగు పరిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చూస్తోందని మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేఎం గౌరీష్ అన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్ కింద మంజూరు చేసిన బ్యాంక్ సిబ్సిడీ రుణాలను ఆదివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరీష్ మాట్లాడుతూ.. మైనార్టీ వర్గాల జీవన ప్రమాణాలను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం రుణాలను అందిస్తోందన్నారు. అదే విధంగా రూ.50 కోట్లతో నిరుద్యోగ యువతకు రుణాలు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు నసీర్, దాస్తగిరి, అమ్రీన్, అజీమ్, రజియా, జరీనా, సమీనా, సల్మా, షేక్ పర్వీన్, వాజిరా, అహ్మద్, నూరుల్లా, బ్యాంక్ అధికారులు తదితరులున్నారు.


మైనార్టీలకు బ్యాంక్ రుణాలను అందజేసిన మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్

కనుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కుత్బుల్లాపూర్: బౌరంపేట్‌లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవం కనుల పండువగా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. స్వామి దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మురళీయాదవ్, విష్ణు, ధర్మారెడ్డి, ఎస్‌వీ సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కార్మికుల సంక్షేమమే పరమావధి

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్‌కేవీ పని చేస్తుందని జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మో కేబుల్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడిగా హ్యాట్రిక్ సాధించిన చింతల నాగరాజు అన్నారు. ఆదివారం కంపెనీలో జరిగిన సమావేశంలో ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మెంబర్లను సైతం ఎన్నుకున్నారు. లీగల్ అడ్వైజర్‌గా గోపాలరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్స్, జనరల్ సెక్రెటరీగా వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా భజన్‌ఖాన్, భాస్కర్ రెడ్డి, సిహెచ్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏసుదాస్, శ్రీనాథ్, ట్రెజరర్ మూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ మూడోసారి తనపై నమ్మకముంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న కార్మికులకు రుణపడి ఉంటానని, గతంలో మాదిరిగా మెరుగైన అగ్రిమెంట్, సదుపాయాలు కల్పించేందుకు యాజమాన్యంతో చర్చిస్తానన్నారు. కార్మికులు సైతం సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో థర్మో కేబుల్ సంస్థ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


థర్మో కేబుల్ పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజు

ప్రతి సమస్యను పరిష్కరించడమే లక్ష్యం


ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును కలిసి సమస్యలను విన్నవిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఆదివారం పెద్ద ఎత్తున ఆయన నివాసానికి వెళ్లి పలు సమస్యలను విన్నవించారు. గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి దంపతులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. అదే విధంగా పలువురు స్థానికంగా ఉన్న రోడ్లు డ్రైనేజీ మురికి కాలువల విషయంపై ఫిర్యాదులు చేశారు.

ఉచితంగా వినికిడి, స్పీచ్ పరీక్షలు


పరీక్షలు చేయిస్తున్న ఆశ్రయ్ ఆకృతి సిబ్బంది

రంగారెడ్డినగర్: వినకిడి, మాట్లాడకపోవడం వంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి ఆశ్రయ్ ఆకృతి ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సందేల హరికృష్ణ తెలిపారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మారుతినగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఆశ్రయ్ ఆకృతి హియరింగ్ అండ్ స్పీచ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి, స్పీచ్ పరీక్షలు నిర్వహించారు. మూగ, బదిరులకు వీడియో ఓటోస్కోపి, బేరా టెస్ట్, ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ వంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగిన ఈ ఉచిత శిబిరంలో సుమారు 150 మంది పరీక్షలు చేయించుకున్నారు.

'మనూ' విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో పరిశోధక విద్యార్థి ఎండీ సాదత్ హుస్సేన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ద ర్భంగా సీటీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాఫర్ ఇక్బాల్‌జైదీ పర్యవేక్షణలో ఆయన 'టెక్నలాజికల్ పెడగోగికల్ కంటెంట్ నాలెడ్జ్ అండ్ సెల్ఫ్ ఎఫిషియన్సీ ఆఫ్ సెకండరీ స్కూల్ సోషల్ స్టడీస్ టీచర్స్- ఏ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేశారు. దీన్ని పరిశీలించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

ఓయూ భూమిలో ఆస్పత్రి నిర్మాణాన్ని అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు చెందిన 2 ఎకరాల భూమిలో బయటి వ్యక్తుల కోసం ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తే అడ్డుకుంటామని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూ భూములు వీసీ ప్రొ.రవీందర్ సొంత ఆస్తి కాదని యావత్తు తెలంగాణ విద్యార్థుల సొత్తు అని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూమ్‌ల కోసం ఓయూ భూములను కాజేసేందుకు సీఎం కేసీఆర్ పదేళ్ల క్రితం ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారని, ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ వీసీ రవీందర్‌ను పావులుగా వాడుకుంటూ వర్సిటీ భూముల కబ్జాకు వ్యూహారచన చేశారని ఆరోపించారు. గతంలో జస్టిస్ చెన్నప్పరెడ్డి కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం ఓయూ భూములు ఇతరులకు కట్టబెట్టకూడదని గుర్తు చేశారు.

నేటి నుంచి 'ఉన్నతి'పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 21నుంచి 23 వరకు, అలాగే, 29 నుంచి సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు అభ్యసనా అభివృద్ధి కోసం చేపట్టిన 'ఉన్నతి' కార్యక్రమం నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఇప్పటికే జిల్లా నుంచి రిసోర్స్ పర్సన్‌లుగా శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను నిర్వహిస్తారన్నారు. ఈనెల 29 నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని శిక్షణ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో 'తొలిమెట్టు' కార్యక్రమం ద్వారా భాష సామర్థ్యాలు, గణిత సామర్థ్యాలపై ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సామర్థ్యాల సాధనకు ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా అమలు చేస్తున్నట్లు విజయకుమారి తెలిపారు. ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల్లో కూడా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమమే 'ఉన్నతి' అని ఆమె వివరించారు.

నేడు విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్



సాక్షి,మేడ్చల్ జిల్లా: విద్యారంగ సమస్యలతోపాటు పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గురుకులాలు, మోడల్ స్కూళ్లలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. మెస్ బిల్లులను విడుదల చేయాలని ,యూనివర్సిటీల్లో పెంచిన ఫీజులను తగ్గించాలన్నారు. విద్యాశాకలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో మూడు రోజు పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నిర్వహించిన అధ్యయన యాత్రలో అనేక సమస్యలను గుర్తించామన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందడం లేదని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా కూరగాయలు, గుడ్లు, పండ్లు ఇవ్వడం లేదన్నారు. మన బస్తీ,మన ఊరు, మనబడి కింద విద్యాసంస్థల్లో చేపట్టిన అభివృద్ధి ,మరమ్మతు, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ చేపట్టిన చలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు.

ఒక్కసారి డిసైడైతే.. నా మాట నేనే వినను

కార్మికుల అభినందన సభలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కార్మికుల పక్షాన ఎప్పుడూ అండగా అంటూ వారి సమస్యల పరిష్కారానికి యాజమాన్యాలతో చర్చించి తప్పకుండా అగ్రిమెంట్లు చేస్తానని.. 'కార్మికుల కోసం ఒక్కసారి డిసైడైతే.. నా మాట నేనే వినను' అని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని ఎంటిఏఆర్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడిగా ఇటీవల విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం యూనియన్ నాయకులు అభినందన సభ బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.

- ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కంపెనీలో పని చేసే ప్రతి కార్మికుడు కలిసిమెలిసిగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో గ్రూపులుగా ఉన్నప్పటికీ ఎన్నికల తర్వాత ఒక కుటుంబంగా ఉండాలన్నారు. యాజమాన్యాలతో అగ్రిమెంట్లు చేసుకునే సమయంలో పంతాలు పట్టింపులు ఉండకూడదన్నారు. సాధ్యమైనంత వరకు కంపెనీ ఉత్పత్తులను పెంచుతూ వేతన ఒప్పంద విషయంలో న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడాలని సూచించారు. తనకు గొప్ప విజయాన్ని చేకూర్చిన ప్రతి కార్మికునికి రుణపడి ఉంటానన్నారు.
- ఏ చిన్న సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తనపై పూర్తి నమ్మకంతో పని చేసిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అరుంధతి ఆసుపత్రిలో కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్మికులు సంవత్సరం పాటు వినియోగించే రూ.4లక్షల హెల్త్ కార్డును అవసరం ఉన్నప్పుడే వినియోగించుకోవాలని సూచించారు.


అభినందన సభలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

బీసీల మనుగడకు కేంద్రం దోహదం

జీడిమెట్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల మనుగడకు ఎంతో దోహదపడుతోందని రాష్ట్ర మాజీ బీజేపీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సహాయం చేయడం హర్షణీయమని నాయకులు అన్నారు. షాపూర్‌నగర్‌లోని ఉషోదయటవర్ ఎదుట ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు పనిలో నైపుణ్యాన్ని నేర్పించి మొదటి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.2లక్షల ఆర్థికసాయం అందజేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందనం దివాకర్, బక్కా శంకర్‌రెడ్డి, పులి బలరాం , పరిశె వేణు, కంది శ్రీరాములు, శ్రీధర్‌వర్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.


ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

'మనూ'లో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిప్లొమో, అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు ఫారమ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీని ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించామన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలాన్నరు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం


ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జీవీఆర్‌కేఆచార్యులుకు అరుదైన అవకాశం కలిగింది. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ (ట్రేడడీఎఫ్ఏటీ) ఆస్ట్రేలియా, ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులుకు ఈ అవకాశం కలిగింది, ఆసియా పసిఫిక్ ఏజ్డ్ కేర్ హబ్(ఏపీఏసీహెచ్) ఫెలోషిప్ కింద ఫ్లిండర్స్ యూనివర్శిటీ నిర్వహించే ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియా ఫెలోషిప్ కింద ఆయన పసిఫిక్‌లో వృద్ధుల సంరక్షణ కోసం కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్‌ల ప్రభావం, నాయకత్వం' అనే అంశంపై ఫెలోషిప్ ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది. ఈ ఫెలోషిప్ కింది ప్రొఫెసర్ ఆచార్యులుతోపాటు ఫ్లైండర్స్ యూనివర్శిటీ, అడిలైడ్, కాన్‌బెర్రా, సిడ్నీలను ఆయన సందర్శిస్తారు. ఈ ఫెలోషిప్‌లో ఆరు దేశాల నుంచి 15 మంది సభ్యులు పాల్గొంటారు. భారతదేశం, నేపాల్, బంగ్లాదేశ్, మలేషియా, ఇండోనేషియా ఫిలిప్పీన్స్ ఆరోగ్యవ వ్యవస్థలను బలోపేతం చేయడంలో వారు అత్యుత్తమ ట్రాక్ రికార్డ్ ఆధారంగా సభ్యులుగా నామినేట్ చేయడ్డారు, అలాగే వారి స్వదేశాలలో వృద్ధుల సంరక్షణ వ్యవస్థలను మెరుగుపర్చడంలో వారు ప్రదర్శించిన నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తారు.

రేపు 'మనూ'లో నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోఈనెల 22వ తేదీన 'మనూ' 5వ నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో ఈ లెక్చర్‌ను నిర్వహిస్తామన్నారు. ఎన్ఎఫ్‌డీసీ ఫిల్మ్ ఫెసిలిటేషన్ మాజీ హెడ్ విక్రమ్‌జిత్‌రాయ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. 'జీ–20 దేశాల మధ్య చలనచిత్ర సహ– నిర్మాణ సాధ్యాసాధ్యాలు' అనే అంశంపై ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో జరిగే ఈ కార్యక్రమం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఐఎంసీ కన్వీనర్, నిర్మాత ఎండీ అమీర్ బదర్ కూడా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి


రాజీవ్‌గాంధీ జయంతిలో పాల్గొన్న బైరి శివకుమార్‌గౌడ్, డప్పు నరేందర్

దుండిగల్: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి ఆదివారం బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, బౌరంపేట మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, నేతలు గడ్డమీది భరత్‌గౌడ్, పోషి మహేశ్‌ముదిరాజ్, జ్యోత్స్నా, లాల్‌సింగ్ నాయక్, పరశురాం గౌడ్, దయానంద్, గౌతమ్‌రెడ్డి, సత్యనారాయణ, నరేశ్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: దూలపల్లిలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ బైరి శివ కుమార్‌గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళలర్పించారు. రాజీవ్‌గాంధీ ఆశయాలు ముందుకు తీసుకువెళ్లాలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ డప్పు నరేందర్, శ్రీనివాస్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.